# తడితడి...

-వేణు సంకోజు

"ఆమె వచ్చి మళ్ళీ స్కోల్డ్ చేసి పోయింది సార్" అన్నాడు కుమారన్ దీనంగా మధుసూదనరావు గారితో.

మధుసూదనరావు గారికి ఒకింత జాలి కలుగుతూనే మరొకింత నవ్వు కూడ వచ్చింది. కాని దానిని బయటపడనీయకుండా జాగ్రత్తపడుతూ - 'అట్లాగా' అన్నాడు.

"అవున్సార్. ఎప్పుడొచ్చినా యింకా ఎక్కువ తిట్లు తిడుతున్నది సార్. చెవులు క్లోస్ చేసుకుంటున్నాను వినలేక. సిటీకంతటికీ వినపడేటట్ల షౌట్ చేస్తుంది సార్. 'అరె చేతగానోడా- పింజారీ వెధవా" అని మొదలుపెట్టి ఏమేమో తిడతావుంటది సార్. చాల స్కోల్డింగ్స్‌కి అర్థాలే తెలియవు సార్ నాకు. నీకింకేం కాలేదురా, ముందుంది నీ పండగ అంటున్నది సార్. కేసు విత్‌డ్రా చేసుకోకపోతే గండిపేట, మీరాలం టాంకు, మంజీరా సరిపోవు గనుక కొత్తగా వచ్చిన కృష్ణా నీళ్ళన్నీ తాగిపిస్తాదంట సార్" అంటూ భయం - భయంగా, సిగ్గు-సిగ్గుగా, అవమాన భారంతో కుంగిపోతూ, కొంచెం కొంచెం వణికిపోతూ కూడ చెప్పసాగాడు కుమారన్.

"నేనూహించగలను కుమారన్ అక్కడ ఏం జరిగిందో. ఇప్పుడు నిబ్బరించుకుని, ఓపిక వహించడం కన్న మార్గం లేదు కదా! మీరు ఎదురుదాడిగానన్నట్లు మీకు చేతనైన తిట్లకు లంకించుకున్నా ప్రమాదమే. జెండర్ బయాస్ అంటూ యింకో కేసు పెడుతుంది మీ మీద. ఆడదని చూడకుండా రోడ్డు మీద అసహ్యంగా ప్రవర్తించాడని రివర్స్ గేర్‌లోకొస్తుంది" అని వారించబోయాడు మధుసూదనరావు.

"ఇప్పుడు మాత్రం అది తప్పుతుందంటారా సార్? నేనక్కడి నుండి సైలెంట్‌గా వస్తున్నప్పుడే అటువంటి హింటొకటి యిచ్చింది. బస్తి వాళ్ళని సాక్షం వుండమంటూ అరిచింది. అంతకు ముందే ఈమె వాలకం ఒకటికి రెండుమార్లు చూసి వున్నారు గనుక ఆ అనుభవం చేత 'ఎవడు పెట్టుకున్న పీడ' అనుకుంటూ ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళి తలుపులు వేసుకున్నారు. అది కొంత రిలీఫుగా ఫీలవుతున్నాను" అంటూ నిట్టూర్చాడు కుమారన్.

"ఇంతకీ కేసు ఎంతవరకొచ్చింది?" అడిగాడు మధుసూదనరావు.

"ఇంకా ఫైనల్ స్టేజికి వచ్చే హోప్స్ కనిపించలేదు సార్. వాయిదాల మీద వాయిదాలే పడుతున్నాయి. లైఫ్ మీద విరక్తి కలగతా వుంది సార్" అంటూ కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాడు కుమారన్.

"ఛఛ అదేంటి కుమారన్- అట్లా నిరాశ పడితే ఎట్లా? లైఫీజ్ లార్జర్ దన్ ఎవ్రిథింగ్ కదా! అంత యిదైపోయేదెందుకు? యూ విల్ విన్. మీ బాధలు తొలగిపోతాయి. త్వరలో విడాకులు పొందుతారు" అంటూ సాంత్వనగా మాట్లాడాడు మధుసూదనరావు.

"నాకా నమ్మకం లేదు" సార్. ఇప్పటికి నిండా మునిగిపోయాను. నా కళ్ళకిప్పుడు దేవతలూ - దేవాలయాలూ ఎలాగూ కనపడవు. దయ్యాలూ భూతాలు కూడా కనిపించీ, గీపెట్టి, రక్కి, చంపబోయి అలసిపోయాయి. వాటికైనా కొంత కనికరం - జాలి వుంటాయేమోగాని నీలమ్మకు కొంచెం కూడ వుండవు సార్. ఆమె రాక్షసి - పూతన - తాటక - మందుల మారి మందర - యమకింకరిణి..." అంటూ పళ్ళు కొరికాడు కసిగా కుమారన్.

ooo

తానా పేపరు ప్రకటన యివ్వడమెందుకూ? ఆమె స్పందించడమెందుకూ? ఒక సంకేత స్థలంలో ఇరువురూ కలుసుకోవడమెందుకూ? ఆమె అంత వినయంగా, అంతకన్న అందంగా, ఆకర్షణీయంగా, చలాకీగా, ముద్దుగా, బొద్దుగా అగుపించడమెందుకూ? ఆమెను రెండవ వివాహం చేసుకోవడమెందుకూ? అని తనను తానే ప్రశ్నించుకుంటూ, విమర్శించుకుంటూ, అసహ్యించుకుంటూ కూడ వుండిపోతున్నాడు కుమారన్. పిచ్చెత్తిపోతున్నది తన మీద తనకే రోజు రోజుకూ. కత్తిపీటతో గొంతు తెగ్గోసుకోవాలని పిస్తున్నది. ఒక్క చుక్క పోటాసియం సైనైడైనా లేనందుకు కసిగా కూడ అనిపిస్తున్నది.

అంతకన్నా ఏం చేయగలడుతాను? వయస్సు మారిపోయిన వాడాకాడు. ఎంత బ్రతిమాలాడు అరుంధతిని! ఎంతగా భంగపడ్డాడు! కాళ్ళు పట్టుకోవడ మొక్కటే తక్కువ. చెప్పుకోకూడదుగాని, యించుమించు

అంత పనిచేశాడు ఒకరకంగా. అయినా, కనికరించ లేదు సరికదా– కసిరి కొట్టింది. కుమారన్‌లు ఒకరికి వందమంది దొరుకుతారు కాని కోరినంత మాత్రాన ఉద్యోగాలు దొరకవని ఎంత ఖరాఖండిగా అంది అరుంధతి! నిర్ఘాంతపోయాడు తాను. తననామె అంత హీనం చేసి, అవమానించినట్టుగా మాట్లాడుతుందని కలలో కూడ వూహించలేదు. కాని, ఇలలో జరిగిందదే.

"మగవాడినని అహంకరిస్తావేమో! మరేం ఫరవా లేదు. ఉద్యోగం ముఖ్యమా సంతానం ముఖ్యమా – సంసారం ముఖ్యమా అని నిలదీస్తే ఉద్యోగమే ముఖ్యమని ఖచ్చితంగా చెప్తాను. మా యిష్టం. మీ పిల్లలనుకుంటే మా వద్దే పెంచుకోండి. నా పిల్లలు కూడ అని గుర్తిస్తే నా వెంట రానీయండి. దేనికైనా సిద్ధమే" – అన్నది అరుంధతి తెగింపుగా.

ఆడదానిలాగా చెంపల మీంచి నీళ్ళు కారుతుంటే తుడుచుకున్నాడు కన్నీళ్ళను కుమారన్. అంతలేసి మాటలు ఆమె ఎలా అనగలుగుతున్నదా అని ఆశ్చర్యపడుతూ ఆర్ద్రంగా – దీనంగా మూలిగాడు.

సర్దుకుంటూ, కన్నీళ్ళను కప్పిపుచ్చుకుంటూ, కలిగిన కోపం కన్న ఎక్కువ కోపంతోనన్నట్టు, విసుగుతో, ఏం చేస్తున్నదో తనకే తెలియని ఒక పిచ్చి ఉద్రేకంతో కసురుకుంటూ ఏమేమో అంటూనే పోతున్నది అరుంధతి : ఎన్నడో అప్లై చేసుకున్నాను. అప్లై అప్లై నో రిప్లై అంటూనే గడిచిపోయింది. ఇన్నాళ్ళు వేచి వేచి, విసిగి వేసారి, జీవితంలో యిక ఉద్యోగ యోగం లేదని భావించిన చాన్నాళ్ళకు వెయ్యి వెలుగులను గుమ్మరిస్తూ, లక్ష ఆశలను చిగురింపజేస్తూ, కోటి కోర్కెలు ఈడేరినట్టుగా, ఒక్క ఉద్యోగం – ఒక్కగానొక్క టీచర్ పోస్టు వచ్చింది నాకు. అదీ నా సొంత గడ్డ మీద. దానిని ఎట్టి పరిస్థితిలోనూ వదలుకోను. ప్రాణం పోయినా సరే చేరి తీరతాను. ఆ ఉద్యోగాన్ని నిలబెట్టుకుంటాను. ఎల్లప్పుడు మగడి మీద – ఒక మగవాడి మీద ఆధారపడి వుండే దీనావస్థ నుండి, దుర్బలత నుండి, అశక్తత నుండి బయట పడతాను. ఉత్పత్తి క్రమంలో నేనూ ఒక భాగ స్వామినౌతాను. నా బతుకంటూ నేను బతికే ఒకే ఒక్క అవకాశాన్ని, అరుదైన అవకాశాన్ని జారవిడుచు కోలేను. ఇప్పుడు కాకపోతే ఇక నాకీ జన్మలో యిదికాదు కదా, మరే వుద్యోగమైనా అలభ్యమే. నా ఏజి దాటిపోయింది. నా అదృష్టం కొద్దీ నాకీ బాక్‌లాగ్ పోస్టు దొరికింది. ఎన్నాళ్ళకు ఎన్నాళ్ళకు దొరికింది! మాకిక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ కాదు. నాకిక్కడ ప్రభుత్వ ఉద్యోగం రాదు. నా పుట్టినూరికి, కేరళకు నేను వెళ్ళిపోతాను. నా ఉద్యోగంలో నేను చేరిపోతాను. మా కేరళ అనుకుంటే, మా మనిషిననుకుంటే, మాకిష్టం వుంటేనే అక్కడికి రండి. కాని నాకు తెలుసు – మా కేరళ మాది కాదిప్పుడు. మాకది చుట్టపు చూపు కావచ్చు. కాని నా బతుకూ చావూ అదే. నా స్వర్గం – నరకం అవే. నాకు మొగడైనా, పిల్లలైనా, తల్లైనా, తండ్రయినా, ఒక్క మాటలో – యిక అన్నీ నాకు ఉద్యోగం తరువాతనే" అంటూ రొప్పుతూ, ఊగిపోతూ, జాలిగా – బాధగా – ఉక్రోషంగా – అమాయకంగా – అశక్తంగా ఆగ్రహంగా, ఏమిటేమిటోగా ప్రవర్తిస్తూ, కొన్ని మాటలు తెలుగులో, మరికొన్ని మాటలు మళయాళంలో అంటూనే వుండిపోయింది అరుంధతి.

"నేను కాదనను అరూ – నేన్నీకు అన్యాయం చేస్తానా? ఎప్పుడైనా డామినేట్ చేశానా? మేల్ షావనిజంతో ప్రవర్తించానా? నీ మనసునెప్పుడైనా నొప్పించానా? పిల్లలను గాని తక్కువచేసి – చూశానా? ఈ ఇంటిని నీ పేరనే కదా రిజిష్టర్ చేయించాను? మా అమ్మనూ – నాన్ననూ సరిగా చూడలేదని గాని, నాకేదో తక్కువ చేశావని గాని ఎప్పుడైనా – ఏదైనా అన్నానా? నీ ఉద్యోగమ్మీద నీకు గల ప్రేమను – ఇష్టాన్ని కాదనను. రెండు వేల కిలోమీటర్ల దూరం మధ్య రెండు కాపురాలుగా మనం ఎలా వేగుతామో ఆలోచించమంటున్నాను. నీకేం తక్కువైందని ఇంత

## పంజరం

హమ్మయ్య!
పక్షి తప్పించుకుంది.
ఇన్నాళ్ళు
బందీగా వున్నా
ఎగిరే లక్షణం
దాని రెక్కలు కోల్పోలేదు
సంతోషం!
కాని
పక్షి ఎగిరిపోయినా
పంజరం
మిగిలి వుంది
కొత్త పక్షి కోసం
కాపు కాసి వుంది.

–ఎస్. హనుమంతరావు

కఠోరమైన నిర్ణయం తీసుకుంటున్నావు?" అర్థింపుగా అన్నాడు కుమారన్.

"అదిగో ఆ మాటే వద్దంటున్నాను. బతికినంత కాలం ఒక భార్యగానే, కేవలం ఒక మగవాడి మీద ఆధారపడిన దానిగానే వుండలేను. నేను స్వతంత్రంగా బతకడం నాకు కావాలి. నా కారణంగా మిమ్మల్ని ఉద్యోగం మానేయమనలేను. నా వెంటా, పిల్లల వెంటా పడి రమ్మనలేను. అట్ ది సేం టైం నేనిక్కడ కేవలం హౌజ్‌వైఫ్‌గా వుండిపోలేను. నాకూ రంపపు కోతగానే వుంది. మీమీద నాకెటువంటి కంప్లెయింట్స్ లేవు. మీరు ఒక భర్తగా అన్నీ చేశారు. కాదనను. కాని, నా జీవితానికి – నా వ్యక్తిత్వానికి – నన్ను నన్నుగా నిలబెట్టే నా ఉద్యోగానికి నడుమ అడ్డుగోడగా భర్త అనే అతడు నిలవడమనే విడ్డూరాన్ని లేదా మా భాషలో అను బంధాన్ని భరించలేకనే తెంచుకోవాలనుకుంటున్నాను. అవున్నేను చంపుకోవాలనే అనుకుంటున్నాను అయితే మీరనుకునే ఆత్మీయతలను కాదు ఒక అడ్డంకిని మాత్రమే తొలగించుకోవాలనుకుంటున్నాను. ప్లీజ్ ఫర్గివ్ మీ. ప్లీజ్ లీవ్ మి టు మై ఫేట్. ఫర్ ది ప్రెజెంట్ ప్లీజ్ లీవ్ మీ అలోన్..." అంటూ చేతులు జోడించి నమస్కరిస్తున్నట్టుగా కోరింది అరుంధతి.

భారంగా – బలహీనంగా – దీనంగా – బేలగా – పిల్లలవైపు జాలిజాలిగా – కన్నీటి పర్యంతమై చూస్తూ – వారిని చేరబిలుచుకుంటూ, విరిగిన ఎముకల గూడులాగ, హృదయం మాయమైన ప్రాణిలాగా – మౌనంగా – మ్లానంగా గది నుండి బయటకు నడిచాడు కుమారన్.

పిల్లలిద్దరూ – అబ్బాయీ, అమ్మాయీ, చిన్నవాళ్లు. ఏమీ అర్థం కావటంలేదు వాళ్ళకు. తొలిసారి యింట్లో ఒక తుఫాను వంటి పరిస్థితిని చూశారు వాళ్ళు. ఆప్యాయంగా తండ్రి గుండెలకు హత్తుకున్నారు. బోరున ఏడ్పొస్తే, భుజానికి నోరు పెట్టుకుని, ఆపుకోలేక – ఆపుకోలేక, పిల్లలెక్కడ భయపడతారోనని పిల్లలకన్నా ఎక్కువ తానే భయపడిపోతూ దుఃఖించాడు కుమారన్. తొలిసారి పెదాల మీదికి 'పరమేశ్వరా' అన్న మాట దొర్లింది. ఎమ్మెస్‌రావ్‌లూ, ప్రేమ్‌చంద్‌లూ కళ్ళలో మెదిలారు. ఏమైంది తనకు? ఏమైపోతున్నాడు తాను? గోవుకన్నా అమాయకంగా, మూగగా రోదిస్తున్నాడు. బయటపడాలి ఆ స్థితి నుండి అనుకుంటున్నాడేగాని! ఎంతకీ బయట పడలేక పోతున్నాడు.

ooo

ఆనాడే అరుంధతి ప్రయాణం. తనేమైపోయినా ఫరవాలేదు – తన పిల్లలు మాత్రం తల్లిలేని అనాథలు కారాదనుకున్నాడు గనుక పిల్లలను ఆమె వెంటే పంపించే నిర్ణయం తీసుకుని వున్నాడు. అరుంధతి మీద కోపం – జాలి – కసి – క్రౌర్యం – ఏకకాలంలో అనేక అభిప్రాయాలు కలుగుతూ వచ్చాయి ఈ ఐదారు రోజులుగా. అన్నింటిలోకీ గౌరవ భావమే నిలిచి వెలిగింది. అసలేమీ జరగనట్టు, ఒక స్నేహితురాలిని సాగనంపుతున్నట్టు ప్రశాంతంగా బయలుదేరాడు రైలు స్టేషనుకి. పిల్లలిద్దరూ రెండు–మూడు రోజులుగా షాపింగులతో ఆనందించియున్నారు. కొత్త బట్టలతో ప్రయాణపు ఉత్సాహంతో మరింత ఆనందంగా అగుపిస్తున్నారు. ఆ తీరుకు గుండెలవిసేలాగున ఏడ్చే వంతు, ఏడ్పును కనిపించకుండా దాచుకునేవంతు, అలా దాచుకోలేక విఫలమయ్యే వంతు ఇప్పుడు అరుంధతిదయ్యింది. ఎక్కడా దారిపొడవునా సంభాషణకు తావులేకపోయింది. మౌనమే రాజ్యం చేసింది. ఇక జీవితాంతం ఈ మౌనమే సుదీర్ఘంగా రాజ్యం చేస్తుందేమోనని భయపడసాగిందేమో, గంభీరంగా మారిపోయింది అరుంధతి ముఖం.

అరుంధతి అందకత్తె మాత్రమే కాదు, విద్యావతి, గుణవతి కూడా. ఆమెలోని అనుకూలవతిని చూసి తెగ మురిసిపోవడం వల్లేనేమొ 'ఈ ఎడబాటు' అనుకున్నాడు కుమారన్. కుమారన్‌ది ఇప్పుడు దిటవు గుండె అయిపోయింది. దేనికీ చలించదేమోనన్నట్టుగా వుండిపోయాడు. అంతసేపూ అరుంధతి మౌనంగా వుండిపోయింది కాస్తా రైలు కంపార్టుమెంటులోకి వెళ్ళి కూర్చున్న తరువాత ఏదేదో చెప్పసాగింది – పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ – అవి ఏమీ అర్థం కావడంలేదు కుమారన్‌కి. 'ఆరోగ్యం – వేళకి భోజనం – ఫిల్టర్ కాఫీ' వంటి పొడి పొడి మాటలు తప్ప ఏమీ గుర్తుండటంలేదు. నిజానికతడు ఆమెను వింటున్నాడే గాని అంతా అల్లుకుపోతున్న దృశ్యం ముందు శ్రవణ సౌభాగ్యాన్ని కోల్పోయినట్టున్నాడు. పిల్లల కేరింతలు – చేతలూపడాలు – దృశ్యాదృశ్యంగా రైలు కదలడాలు తప్ప ఏమీ కనిపించడంలేదు – వినిపించడంలేదు. పెద్ద కేకే అయినా రైలు కూత అతని చెవిని సోకనే లేదు. రైలు కదలి మెల్లమెల్లగా వేగం పుంజుకుని కొన్ని క్షణాలు గడిచాక గాని పొడి పొడి మాటల మధ్య 'పెళ్ళి' అన్న మాట కూడ దొర్లటం అస్పష్టంగా వినిపించింది కుమారన్‌కి. ఈలోగా రైలు కన్పించినంత

మేర పట్టాలు దాటి తన జీవితంలాగే ఒక్కసారే చిన్నదైపోయి చివరకు కనుమరుగై పోయింది.

○○○

మళ్ళీ కోర్టు కేసు. మళ్ళీ నీలమ్మ తిట్లూ శాపనార్థాలతో అరుంధతి ఆలోచనల నుండి ఈ లోకానికొచ్చిపడ్డాడు కుమారన్. మళ్ళీ అవే ఆలోచనలు.

ఒకటికి రెండుమార్లు వెళ్ళొచ్చాడు కేరళకు. అరుంధతి చాల హుషారుగా, హుందాగా, అభిమానంగా, ఇష్టంగా, పిల్లల మధ్య తల్లిగా, ఒక దేవతగా కూడ అగుపించింది కుమారన్‌కి. రెండుసార్లూ ఇదే వరుస.

తన పరిస్థితికేంగాని, ఆమె ఆనందాన్ని, ఉత్సాహాన్ని చెరిపివేయకూడదనీ అనుకున్నాడు కుమారన్. పిల్లలు కూడ అదే స్కూల్లో చేరి ముద్దుగా చదువుకుంటూ, బొద్దుగా ఎదుగుతున్నారు. వాళ్ళే గనుక తన వద్ద వుండి వుంటే ఈ ఆర్నెల్లలో ఏమైపోయి వుండేవాళ్ళో! ఎటొచ్చి తనే వుండలేకపోతున్నాడు. అరుంధతి లేని యిల్లు అడవిగాచిన వెన్నెలగా అనిపించింది. కాని ఆమె మాత్రం చాలా బాగా అడ్జెస్టు అయిపోయింది. అది అతనికి మహా అంతుబట్టని విషయంగా అనిపించింది.

'సెలవులుంటే వుండిపోరాదా' అని అరుంధతి అడిగినప్పుడు అతడి ప్రాణం ఎంత విలవిల్లాడిపోయిందో అతడికే తెలుసును. కాని, తన ఎమోషన్స్‌ని బిగ్గరగా అదిమి పట్టుకున్నాడు. సెలవులస్సల్లేవని అబద్ధం చెప్పాడు. ఆమె కూడ బలవంతపెట్టలేదు.

అరుంధతి స్థితప్రజ్ఞత్వం మీద ఎంతో గురి, అభిమానం కుమారన్‌కి. ఆమె నుండి ఆ లక్షణాన్ని నేర్చుకోవలసిందేననుకున్నాడు గనుక కొంత కష్టమైనా అలా ప్రవర్తించడానికే అలవాటుపడ్డాడు. ఇక మీద అదేకదా తనను రక్షించాలి అని కూడా అనుకున్నాడు.

తనకన్నా కొంచెం వయస్సులో ఒకటీ అరా సంవత్సరాలు చిన్న వయస్సు కుర్రవాడు స్కూల్లో అరుంధతితో ఆప్యాయంగా, చనువుగా కలిసి తిరుగుతూండటం తొలిసారి చూసినప్పుడు మనస్సు చివుక్కుమంది కుమారన్‌కి. గుండెలో సూదులు కసికసిగా గుచ్చినట్లయింది. కాని ఏం చేస్తాడు? మిన్నకున్నాడు. రెండవసారి వచ్చి చూసినప్పుడు అంత బాధ అనిపించలేదు. అతడి గురించి అరుంధతి కూడ చాల యిష్టంగా, అభిమానంగా మాట్లాడింది. అతనికి కొన్ని కళలున్న విషయం చెప్పింది. అతడు కవి, చిత్రకారుడని పరిచయం చేసినప్పుడామె బుగ్గలు ఎరుపెక్కడం అతడు గమనించాక యిక తాను శాశ్వతంగా ఆమెకు దూరమయ్యే క్రమం లీలగా ద్యోతకమవసాగింది. అప్పటి నుంచే యిక వెళ్ళలేక పోయాడు కేరళకు. ఆమె ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాసింది. వాటికి చాలా ఆలస్యంగానూ, ముక్తసరిగానూ సమాధానమిచ్చాడతడు. కొన్నిటికి జవాబివ్వలేదు కూడ. ఆమె కూడ కొంత కాలం తరువాత వ్రాయడం మానేసింది.

## రాజొచ్చిన వేళ

ఆరోజు
నా రాజు వచ్చాడు
కలల్నుండి గెంతి
కళ్ళల్లోకి వచ్చాడు

వాడొచ్చాక
పతంగి ప్రాణం పోసుకుంది!
గోటి బిళ్ళ గువ్వలా ఎగిరింది!
పావురాలు కువకువలతో ఎగిరాయి!
పువ్వులన్నీ దారి చూపాయి!
చిన్ని చిన్ని పాదాలన్నీ వేళ్ళని కాళ్ళల్లో
చుట్టుకున్నాయి.

మైదానంలో క్రికెట్ బంతి
గాలితో పోటీ పడింది!
కామిక్స్ కిలకిలా నవ్వాయి!
వాడు ఫ్లూటు
ఊదుకుంటూ
గెంతుకుంటూ
తిరుగుతుంటే
వాడి దూకుడికి
'దినకరుడే' పశ్చిమానికి పారిపోయాడు!
వాడి కేకలు పర్వతాల గుండెల్లో
ప్రతిధ్వనించాయి!
చంద్రుణ్ణి
నాకు తోడిచ్చి
తను ఎంఎంటిఎస్‌తో మాయమయ్యాడు!

–ఎం. వీరేశ్వరరావు

అనుకోకుండా ఒకరోజు కుమారన్‌కి తీవ్ర జ్వరం కాచింది. మధుసూదనరావూ, పక్కవాళ్ళూ చూసి, ఆస్పత్రిలో చేర్చారు. వైరల్ ఫీవర్. వారం రోజులకి గాని తగ్గలేదు. ఈ వారం రోజులూ అతడొక నరకం కాని నరకాన్ని చవిచూశాడు - ఒంటరిగా తొలిసారి. తోడు లేనిదే ఇక బతకటం కష్టమని అప్పుడే బాగా అనిపించింది. అంత వరకూ మిత్రులూ, బంధువులు చెబితే అతడు వినియుండలేదు. కానిప్పుడు బాగా అర్థమైంది. ఆ వారం రోజులూ అరుంధతి అనురాగం, ఆమెలోని అమ్మగుణం, ఆలితనం క్షణక్షణం కళ్ళల్లో కదలాడాయి. ఉద్యోగం మానేసి ఆమె దగ్గరికే వెళ్లిపోయి శేష జీవితం గడిపేద్దామా అని కూడ అనిపించింది. కాని ఎంతకాలం? వారం పదిరోజులూ, నెలా- రెన్నెళ్ళూ. ఆ తరువాత తను తన భార్యకీ పిల్లలకీ భారమైపోడూ? ఒకరి మీద ఆధారపడి బతకటమే! అసాధ్యం అనుకున్నాడు. అయినా తన భ్రమకానీ, అరుంధతికిప్పుడు తన మీద అంతటి మమకారం వుందా? ఆ యువకుడు - కళాకారుడు - ప్రతిభావంతుడి ముందు తాను వెల వెల బోడూ? అయినా తన మూర్ఖత్వం కాని, కోరి తన నుండి తాను దూరమై, తీరా ఎడం కాస్తా పెరిగాక వాళ్ళు మరింత దగ్గరయ్యాక యిప్పుడు అటువంటి ఆలోచనలను చేయడమేమిటి? అప్సర్డ్ అనుకున్నాడు. పత్రికల్లో ప్రకటన యిచ్చాడు. నీలమ్మ అనే నరకం మెడకు చుట్టుకుంది. అయితేనేం, ఒంటరితనం కన్న యిది కొంత మేలేమోననుకున్నాడు. కాని భరింపరాని నరకమైంది.

ఒకనాడు యథావిధిగా కార్యాలయం నుండి సాయంత్రం యింటికొచ్చాడు. ఆ దృశ్యాన్ని చూసి గతుక్కుమన్నాడు. నీలమ్మ తను అనుకున్నట్టుగా విడోకాదు. ఆమె మాజీ భర్త అనే అసలు భర్తతో తన ఇంట్లోనే ఆనందకేళిలో ఓలలాడసాగింది. కుమారన్ రాకను వాళ్ళు గమనించనేలేదు.

○○○

శారీరక వాంఛ తీర్చుకోవడం తప్పుకాదు. నీలమ్మ మీద ఆ విషయంలో అతనికెటువంటి ద్వేషమూ, అభ్యంతరమూ లేవు. కాని తనను మోసగించినందుకే బాధ. భర్త వుండి విధవనని వచ్చి ఇన్నాళ్ళూ విధవరాలిగా నటించి తనను మోసగించినందుకు కుంగిపోయాడు. జీవితంలో మరణం కన్న మోసగించబడటం, ఓడిపోవడమన్నవి చాల పెద్ద మరణాలనుకున్నాడు. ఎందుకు చేశారిదంతా నీలమ్మ వాళ్ళు? తన ఆస్తికోసం. ఇది దాస్తూ వచ్చారింత కాలం. డబ్బును గుంజే ప్రయత్నం చేస్తూ చుట్టాల పేరిట ఇంటిని చిన్నపాటి క్లబ్బునూ, బారునూ చేస్తున్నారని విసిగిపోయికదా తను ఈమెను వద్దనుకుని విడాకులు కోరాడు. కేసు తనకనుకూలంగా మారు తున్నదని కొత్త ఎత్తు వేశారు.

నీలమ్మా ఆమె ప్రియుడనబడే - మాజీ అనబడే - అసలు భర్త చూడకుండానే బయటికి నడిచాక ఒక్క క్షణం కూడ వుండలేకపోయాడు. మధుసూదనరావు గారినీ, లాయరు గారినీ యథాప్రకారం కలిశాడు - కుమారన్.

తెల్లవారే సరికల్లా వీధిలో సంచలనం. ఏమై వుంటుంది- ఎందుకై వుంటుంది - అనుకుంటున్నారు.

మొద్దుబారి - మాట పడిపోయినట్లుగా ఒక పక్కన బీరువాకు ఆనుకుని దరిద్ర దేవత లాగా జుట్టంతా రేగి కూర్చుంది నీలమ్మ. ఆమె పక్కన అటుయిటుగా ఆమె బంధువులు.

కమిలినట్టుగా బిగుసుకుపోయిన శరీరంతో శవంగా మారిన కుమారన్ నడింట్లో పడుకున్నట్టుగా, ఎవరైనా పిలిస్తే దయచేసి కాస్సేపు నన్ను డిస్టర్బ్ చేయకండన్నట్టుగా వున్నాడు.

మధుసూదనరావుగారు ఉత్తరం చదవసాగారు. 'ప్లీజ్ లీవ్ మీ అలోన్' అంటూ మొదలై ముక్తసరిగా కొన్ని విషయాలు వ్రాసియున్నాడందులో కుమారన్. జీవితం తనను ఓడించలేదని, ఉద్యోగం ఓడించిందని వ్రాసుకున్నాడు. తనను అక్కున చేర్చుకున్న స్నేహితులకు, బంధువులకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తనిప్పుడు మరణించిన ఇల్లు తన పిల్లలకు చెందు తుందని, ఈ మధ్యనే మియాపూర్‌లో కొన్న యిల్లు నీలమ్మకు దక్కుతుందని వ్రాశాడు. తనను 'వెధవ' అని నిరూపించేందుకు నీలమ్మ విధవగా మారి వుంటుందని కూడ అభిప్రాయపడ్డాడు. కోర్టులోని కేసును విత్‌డ్రా చేసుకుంటున్న విషయం, లాయర్‌ని అప్పటికే ఆ విషయమై సంప్రతించిన విషయం వ్రాసుకున్నాడు. తన భార్య సమక్షంలోనే అంత్యక్రియలు జరగాలని, తన శరీరానికి తన తనయుడే నిప్పుపెట్టాలని, వారిని రమ్మని టెలిగ్రాం యిచ్చానని, ఈ విషయం దగ్గరుండి చూసుకొమ్మని ప్రత్యేకించి మధుసూదనరావును కోరాడు. తనలాగే తన పిల్లలను ఎప్పుడొచ్చినా ఆదరించాలనే మాటలు చదువుతున్నప్పు డు మధుసూదనరావు కళ్ళవెంట నీళ్ళు జలజల రాలి ఉత్తరంలోని అక్షరాల మీద పడి తడితడి అయ్యాయి.